

20న పిఠాపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 20వవ తేదీన జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డి.హరిశేషు తెలిపారు. మెగా జాబ్ మేళాలో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సుమారు 700 ఉద్యోగాలను భర్తీ చేసే అవకాశం ఉందని వివరించారు. విద్యార్హతలు 10వ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ చేసి ఉండాలన్నారు. ఎంపికైన ఉద్యోగాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.22 వేల వరకూ జీతాన్ని నిర్ణయిస్తారని తెలిపారు. ఇంటర్వ్యూకి హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, ఆధార్, ఐడి, అండ్ అడ్రస్ ప్రూఫ్‌తోపాటు విద్యార్హత సర్టిఫికెట్స్‌తో హాజరు కావలన్నారు. మరిన్ని వివరాలకు 8639951441, 9949156583 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇసుక ఇక్కట్లు తీరేనా..?

- అస్తవ్యస్తంగా మారిన నిర్మాణ రంగం
- పస్తులతో భవన నిర్మాణ కార్మికులు
- ఎప్పటి నుంచనేది కానరాని స్పష్టత



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత ప్రభుత్వం చేసిన తప్పులను మేము చేయబోమని ఇసుక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉచిత ఇసుకను అందిస్తామని కూటమి సర్కారు ప్రకటించింది. గోదావరి వరదల నేపథ్యంలో రీచ్‌లలో నిల్వ ఉన్న స్టాకులను ఈ ఏడాది జులై 8 నుంచి ఇసుకను ఉచితంగా సరఫరా చేశామని చెప్పుకొచ్చింది. అయితే స్టాక్ పాయింట్లలో ఇసుక కొద్ది రోజులకే నిండుకుంది. అధికార పార్టీకి చెందిన కొందరు రాజకీయ నాయకులు ఇసుక నిల్వలను అక్రమంగా తరలించుకుపోవడంతో ఆదిలోనే కొరత ఏర్పడింది. దీంతో గత నెల రోజులుగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో ఉచిత ఇసుక విధానంలో భాగంగా వినియోగదారులు నేరుగా బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ ప్రకటించారు. ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని ఈ నెల 19 నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు గనులశాఖ, రవాణా శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయని ప్రకటించారు. అయితే గోదావరి వరదలు తగ్గుముఖం పట్టని నేపథ్యంలో ఇసుక ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనేది అధికారులకు సైతం నేటికీ స్పష్టత లేదు. దీంతో ఇసుక మరికొన్ని రోజుల వరకూ దొరికే అవకాశం కనిపించడం లేదు.

53 రకాల నిర్మాణ కార్మికులు ఎదురు చూపులు

కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో సుమారు 5 లక్షల మంది కార్మికులు నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్నారు. ఇందులో తాపీ మేస్త్రీలు, నిర్మాణ కూలీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబింగ్ వర్కర్లు, పెయింటర్లు, ఇసుక ఎగుమతి, దిగుమతి కూలీలు, ఇటుక బట్టీల యజమానులు, అందులో పని చేసే కూలీలు, సిమెంట్ పరిశ్రమలు, దానిపై ఆధారపడిన వర్కర్లు, ఐరెన్ పనులు చేసే కూలీలు, భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, టైల్స్ మేస్త్రీలు, కార్పెంటర్లు వీళ్లకు సహాయకులు వేల మంది ఉన్నారు. ఇలా 53 విభాగాలకు చెందిన కార్మికులు నిర్మాణ రంగంపై ఆధారపడి ఉపాధిని పొందుతున్నారు. అయితే కొంతకాలంగా వీరంతా పూర్తిగా పస్తులతో కాలం వెళ్ళదీస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇసుక విధానంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. గత వైసిపి పాలనలో ఇసుక నూతన పాలసీ వలన ఏడాదిపాటు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కరోనా మహమ్మారి ప్రపంచమంతా విస్తరించడంతో అన్ని వ్యవస్థలు స్తంభించాయి. దీనిలో భాగంగా నిర్మాణరంగం సైతం కుదేలైంది. ఈ నేపథ్యంలో గత వైసిపి పాలనలో దాదాపు మూడేళ్లపాటు ఇసుక కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఆ తర్వాత అందుబాటులోకి వచ్చినప్పటికీ మధ్య దళారీ వ్యవస్థ వలన అరకొర ఇసుక మాత్రమే దొరికేది. మరోవైపు జోరుగా అక్రమ వ్యాపారం సాగేది. ఇసుక ఒక మాఫియా చేతుల్లోకి పోవడంతో అధిక ధరలకు విక్రయాలు జరిగేవి. ఇటు వినియోగదారులు అటు నిర్మాణరంగంపై ఆధారపడిన కార్మికులకు సమస్యలు తప్పలేదు. అయితే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో నిర్మాణ రంగ కార్మికులంతా ఆనందం వ్యక్తం చేశారు. కొరత లేకుండా ఇసుక అందుబాటులో ఉంటుందని భావించారు. అయితే కొద్ది రోజులు మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. నూతన విధానం ఇంకా అమలు కాకపోవడం, మరోవైపు వరదలు కారణంగా ఉచిత ఇసుక ఇంకా అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం వరదలు కొనసాగుతున్న తరుణంలో ఇసుక ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందనేది యంత్రాంగానికి సైతం ఇంకా పూర్తిస్థాయి స్పష్టత లేదు. ఈ పరిస్థితి మరో నెల రోజులు ఉండే అవకాశం కనిపిస్తోంది.

ఆన్‌లైన్ బుకింగ్‌కు ఏర్పాట్లు

ఇసుక దారి మళ్లకుండా, ఇతరులు అధిక ధరలకు విక్రయించకుండా నిఘా ఉంచి పటిష్టమైన చర్యలను ప్రభుత్వం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 19 నుంచి వినియోగదారులే నేరుగా బుక్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకోసం ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ యాప్‌ను అధికారులు సిద్ధం చేశారు. దీని అమలుపై తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, గనుల శాఖలకు చెందిన ఉద్యోగులకు ఉచిత ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌పై అవగాహన కల్పించారు. డోర్ డెలివరీకి రవాణా ఛార్జీలను కూడా ఇప్పటికే ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అధిక ధరలకు అమ్మ కుండా నిఘా ఉంచేందుకు జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.



పిజిఆర్‌సిలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీలకు సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ ఎస్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, పింఛన్ల మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, ఆక్రమణలు తొలిగింపు, డ్రెయిన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు చెందిన 174 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలకు సంబంధించి అర్జీదారుని సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గత పది రోజులుగా భారీ వర్షాలు, వరదలు కారణంగా అర్జీల పరిష్కారాల ప్రగతిని సమీక్ష నిర్వహించ లేదన్నారు. ఈ నెల 28, శనివారం అర్జీల పరిష్కారంపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారం, సన్నద్ధతో సమావేశానికి హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, సిపిఒ పి.త్రినాథ్, జడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - కోటనందూరు



ఏచూరికి నివాళులర్పిస్తున్న బేబిరాణి, పద్మ తదితరులు

కోటనందూరులో సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి ఘనంగా నివాళు లర్పించారు. తొలుత నాయకులు ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జి.బేబిరాణి మాట్లాడారు. ఏచూరి మరణం దేశానికి తీవ్ర లోటు అన్నారు. తుది శ్వాస వరకూ కార్మిక, కర్షకులు, పేదల సమస్యల పరిష్కారానికి పోరాడారన్నారు. ఉత్తమ పార్లమెం టేరియన్‌గా నిలవడమే గాక అధికార, ప్రతిపక్షాల నాయకుల నుంచి సైతం ప్రశంసలందుకున్న నేత అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె.పద్మ, దుర్గ, మరియ, రత్న, దేవుడమ్మ, కమలారాని, నక్కెళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఎంఎల్ఎ ఆగ్రహం

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో అధికారులు భాగస్వాములు కాకపోతే ఎలా? అని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానికంగా జరిగిన స్వచ్ఛతాహి కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హజరుకాకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. ఇలాయితే ప్రభుత్వ ఆలోచనలు ప్రజలకు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ప్రభుత్వం చేపట్టి ప్రతీ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియ చేయాలని ఎంపిడిఒకి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తుందని, ఇందులో గ్రామస్తులను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకోవాల్సివుందన్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, కొత్త కొండబాబు, వైసిపి నాయకులు రఘురాం, అధికారులు పాల్గొన్నారు.

వలలు తెగిపోవడంతో రూ.90 లక్షల నష్టం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

తుపాన్ ప్రభావంతో సముద్రంలో చేపల వేట కోసం వేసిన వలలు తెగిపోయి కన్పించకపోవడంతో రూ.90 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉప్పాడ గ్రామంలో వలలు పోయిన బాధితులను మత్స్యకార పెద్దలు చోడిపిల్లి ప్రసాద్, సురాడ రాజు, రాచపల్లి చనపయ్య, మెరుగు భూషణం,.కొవ్వూరు రాంబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత మత్స్యకారులు బొందు కొండయ్య, రమణ, కొవ్వూరి ముసలయ్య, కారే శ్రీను, కొవ్వూరి కొండయ్య, కోడా కృష్ణ, గండేపల్లి సత్యవతి జరిగని సంఘటనను పెద్దలకు వివరించారు. గత నెల 30వ తేదీన. వైజాగ్ తీరం నుంచి తమ బోట్లతో సముద్రంలో వేటకు వెళ్లామని, సముద్రంపై వేటాడుతుండగా ఈనెల.7న వచ్చిన తుపాన్‌కు వేటాడుతున్న ప్రదేశాల్లో అలలు ఎక్కువ కావడంతో చేపల కోసం వేసిన వలలు తెగిపోయి కన్పించకుండా పోయాయని తెలిపారు. రెండు రోజులపాటు నడి సముద్రంలో వలల కోసం వెతికిన ప్రయోజనం లేకపోయిందని వివరించారు. సముద్రంపై వేటాడుతుండగా వలలు పోవడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క వల రూ.10 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఉంటాయని వివరించారు. మత్స్యకార పెద్దలు కాకినాడ మత్స్యశాఖ అధికారులకు జరిగిన సంఘటనపై వినతిపత్రాన్ని అందించారు. మత్స్యకారులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి మత్స్యకారులను ఆదుకోవాలని మత్స్యకార పెద్దలు కోరారు.

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - కాకినాడ



అధికారులతో కలిసి గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జడ్‌పి, పంచాయతీరాజ్, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల నిర్వహణ, విజయవంతంపై చర్చించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా -2024 గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు మూడు అంశాలపై స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. స్వచ్ఛతా భాగిదారి కింద గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్య అంశాలపై గ్రామ సభలు నిర్వహించడం, విద్యార్థులతో ర్యాలీలు, క్విజ్ పోటీలు, సాంసకృతిక కార్యక్రమాలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించాలన్నారు. గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావడం, నూతనంగా నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలను ప్రారంభోత్సవాలు చేయడం, గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమం కింద పారిశుధ్య కార్మికులను సత్కరించడం, శానిటేషన్ కిట్స్ పంపిణీ, మహిళలకు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ కె.భారతిసౌజన్య, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ జె.నరసింహనాయక్, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధికి విరాళాలు

ప్రజాశక్తి - కాకినాడ



కలెక్టర్‌కు చెక్‌ను అందిస్తున్న ఎస్ఆర్ఎంటి జెఎండి

ఇటీవల రాష్ట్రంలో వచ్చిన భారీ వర్షాలు, వరద లకు నష్టం కలిగిన కారణంగా తమ వంతు సాయంగా రిటైర్డ్ సైనిక ఉద్యోగులు మంగళ వారం కలెక్టరేట్లో సీఎం సహాయ నిధి కి రూ.42 వేలు చెక్ ను కలెక్టర్ షాన్ మోహన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిటైర్డ్ సైనిక ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. అలాగే కాకినాడ శ్రీరామదాసు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్ జెఎండి కంటిపూడి జయ కలెక్టర్‌కు రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి అభినందనలు తెలిపారు.

అన్నదాన పథకానికి రూ.6 లక్షల విరాళం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ దేవస్థానం నిత్యాన్న దాన పథకానికి దాత ఒకరు రూ. 6 లక్షలు విరాళం అందించారు. మంగళవారం హైదరాబాద్‌కి చెందిన పోతుకుంట శ్రీలక్ష్మి రూ.4.50 లక్షలు నగదు, ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా రూ.1.50 లక్షలు మొత్తం రూ.6 లక్షలు విరాళాన్ని దేవస్థానం పిఆర్ఒ కృష్ణారావుకి అందజేశారు.

ఆకతాయిల వికృత చేష్టలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - తాళ్లరేవు

రోజు పాఠశాలకు వెళ్తున్న విద్యార్థుల పట్ల పలువురు ఆకతాయిలు చేస్తున్న వికృత చేష్టలకు కోరంగి పోలీసులు అడ్డుకట్ట వేశారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో స్కూల్స్‌కు వెళ్లే విద్యార్థునుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మోటారు సైకిల్స్‌తో విన్యాసాలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడంపై వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఎస్ఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు మఫ్టీలో ఉండి అటువంటి ఆకతాయిలున గుర్తించి కౌన్సిలింగ్‌ను ప్రారంభించారు.

మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కామరాజు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పాత పెద్దాపురంకు చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తోట కామరాజు(92) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన ముప్పన రామారావు, తాళ్లూరి గంగభవాని మున్సిపల్ పాలకవర్గాల్లో కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలందించారు. అలాగే రెండుసార్లు కౌన్సిల్ కో- ఆప్షన్ సభ్యునిగా పనిచేశారు. ఆయన మృతికి మున్సిపల్ కౌన్సిలర్లు వీరరాఘవ, కృష్ణబాపూజీ, నాయకులు ముప్పన వీర్రాజు, తోట సోనీ, తోట చంటిబాబు, సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు సంతాపం వ్యక్తం చేశారు.

మెడికవర్ హాస్పిటల్స్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ చినరాజప్ప

మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పిఎం మోడీ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడంటే మరోకరికి ప్రాణదానం చేసినట్లేనని అన్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించేందుకు రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం అనేది జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. సెంటర్ హెడ్ సుభాకర్ మాట్లాడుతూ హాస్పిటల్స్ ఆవరణలోనే బ్లడ్ బ్యాంకు ఉండటం ఎంతో ఉపయోగకరమని అన్నారు. రోగులకు ఇబ్బంది లేకుండా రక్తం అతి తక్కువ సమయంలోనే అందించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్తదాతలతోపాటు మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం


ప్రజాశక్తి - జగ్గంపేట, కాకినాడ రూరల్



కాకినాడ రూరల్ ఎపిఎస్‌పి హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ

జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ బాలరాజు అధ్యక్షపోన్యాసం చేశారు. ఓజోన్ పొర పరిరక్షణపై అందరూ అవగాహన కలిగి ఉండాలనీ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ పర్యావరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మజ్జి కిరణ్మయి ఒడ్డి ఆన్ లైన్‌లో మాట్లాడారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు మల్లికార్జున శర్మ ఓజోన్ పరిరక్షణ దినోత్సవంపై ఆన్‌లైన్ క్విజ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గోపాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్ ఎపిఎస్‌పి జడ్‌పి ఉన్నత పాఠశాల ప్లస్ ఆధ్వర్యంలో పర్యావరణ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.గాయత్రి, కళాశాల ఇన్‌ఛార్జ్ కందుకూరి పాల్‌రాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతియ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఆపస్ జిల్లా అధ్యక్షులు ఎస్.చలపతి, పాఠశాల ఇన్‌ఛార్జ్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



స్వచ్ఛతాహి సేవతో గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలు మండలాల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే అవగాహన ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞలు నిర్వహించారు.

కాకినాడ స్థానిక కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ సమీపంలో ఏర్పాటు చేసిన మానవహారం, పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలను కమిషనర్ భావన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ టికె.సుధాకర్, ఎస్ఇ సత్యకుమారి, ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్, పాల్గొన్నారు. **సామర్లకోట** పట్టణంలోని స్టేషన్ సెంటర్లోనూ, మండలంలోని హుస్సేన్‌పురంలో గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి, గ్రామ సర్పంచ్ మార్ని నాగమణి, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఎంపిడిఒ దేవిశ్రీలలిత కూటమి నాయకులు పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. **ఏలేశ్వరం** నగర పంచాయతీ, ప్రకృతి పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ అలమండల సత్యవతి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.విజయ్‌బాబు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు అనసూరి నాగేశ్వరరావు, పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ డివివి.సత్యనారాయణ పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పలు పంచాయతీల్లో ఎంపిడిఒ ఎం. అనుపమ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు జరిగాయి. నీలపల్లిలో సర్పంచ్ చిట్టూరి నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. తాళ్ళరేవు పంచాయతీ సర్పంచి రెడ్డి అరుణ సుహాసినిదేవి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. పి.మల్లవరం హైస్కూల్లో విద్యార్థులు ర్యాలీ చేశారు. **పెద్దాపురం** పట్టణంలో స్వచ్ఛతాహీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, రాజా సూరిబాబు రాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. **శంఖవరం** అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు సదన్ సత్రం రోడ్డుకు ఇరువైపులా ఉద్యోగులు, సిబ్బంది శుభ్రం చేశారు. అన్నవరం పంచాయతీ సర్పంచ్ ఎస్.కుమార్ రాజు ఆధ్వర్యంలో పంచాయతీ మరియు శానిటేషన్ సిబ్బంది దేవస్థాన హైస్కూల్ ఉన్న పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం విఆర్ఒ దామిని కృష్ణారావు వివిధ విభాగాల ఎఇఒలు, పర్యవేక్షణాధికారులు పాల్గొన్నారు. **కరప** మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతాహీ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఎంపిడిఒ కె.అప్పారావు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, కార్యదర్శి సునీల్‌కుమార్, భోగిరెడ్డి కొండబాబు, పేకెట్ ప్రసాద్, జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళీకృష్ణ పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, విద్యా శాఖ అధికారులు కెబి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.



కాకినాడ నగరంలో ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న ఎంఎల్ఎ వనమాడి, అధికారులు



తాళ్లరేవులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



కరపలో వీధులను శుభ్రం చేస్తున్న అధికారులు, నాయకులు



ఏలేశ్వరంలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - ఆలమూరు, ఆత్రేయపురం, చాగల్లు

పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక శివారు పంట పొలాల్లో ముగ్గురు వ్యక్తులు పేకాడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి అదుపులోకి తీసుకున్నా మన్నారు. వారి వద్ద నుంచి రూ.2,420 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. అలాగే ఆత్రేయపురం మండలంలోని పులిదిండి శివారును పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వారి నుంచి రూ.2,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అలాగే చాగల్లు మండలం బ్రాహ్మణ గూడెం శివారులో పేకాట శిబిరాలపై ఎస్ఐ కె.నరేంద్ర సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.21,810, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశారు.

గోదావరిలో మృత దేహం లభ్యం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండల పరిధిలోని పళ్ళవారిపాలెం వివేకానంద వారధి వద్ద గోదావరి నది పాయలో ఒక వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. గోదావరిలో మృతదేహం తేలుతున్నట్లు స్థానికులు ముమ్మిడివరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సిబ్బంది మృతదేహాన్ని గోదావరి నుంచి బయటకు తీసి ఆ మృతదేహంపై ఉన్న ఆధారాలు పరిశీలించారు. మృతుడు విజయవాడ రూరల్ మధురానగర్‌కు చెందిన ముద్దన సూర్య నారాయణ(53)గా గుర్తించారు. సూర్యనారాయణ గతంలో గంజాయి రవాణా కేసులో నిందితుడిగా అనకాపల్లి జిల్లా చోడవరం కోర్టుకు వాయిదాలకు వెళు తూ వస్తూ ఉండేవాడు. మృతదేహానికి శవ పంచనామా నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - రాజానగరం

హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టుకు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సిఐ ప్రసన్న వీరయ్యగౌడ్ మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. రంగంపేట మండలం సుభద్రంపేటకు చెందిన పూసల సుబ్రహ్మణ్యం రాజానగరం ఎస్‌పి.రాజు లేఅవుట్‌లో నివాసం ఉంటున్న కర్రి శ్రీనివాస్‌కు అప్పు ఉన్నాడు. తనకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించాలని శ్రీనివాస్ సుబ్రహ్మణ్యంను అడిగాడు. దీంతో సుబ్రహ్మణ్యం శ్రీనివాస్‌పై కక్షగట్టాడు. ఈనెల 12వ తేదీ రాత్రి ఒంటిగంట సమయంలో శ్రీనివాస్ ఒంటరిగా కారులో ఇంటికి వెళ్తున్నాడు. తాను ఉంటున్న లేఅవుట్ గేట్ వేయడంతో కారు దిగి గేట్ తీస్తున్నాడు. ఈ సమయంలో పూసల సుబ్రహ్మణ్యం, అతని స్నేహితులు నండూరి వీరబాబు, ముమ్మిడి మునిసాయి, నున్న అభిషేక్, ముమ్మిడి దుర్గాబాయి కలిసి సుత్తితో శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డారు. చేతికి, నడుముపైనా గాయాలతో అక్కడ నుంచి శ్రీనివాస్ తప్పించుకున్నాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన సుత్తిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. వారిని కోర్టుకు తరలించారు. త్వరగా నిందితులను గుర్తించి కోర్టులో హాజరు పరిచినందుకు ఎస్ఐ మనోహర్, హెడ్ కానిస్టేబుల్ కెవి సత్యనా రాయణ, కానిస్టేబుల్ మణికంఠలను ఎస్‌పి నరసింహకిషోర్, సిఐ ప్రసన్నవీరయ్యగౌడ్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

తూర్పుగానుగూడెం జాతీయ రహదారిపై మోటారు సైకిల్ రాంగ్ రూట్ లో వచ్చి ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. రాజానగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. రాజమండ్రి నుంచి జగ్గంపేటకు బైకుపై గొర్ల వెంకటరమణ(37), కుమారుడు రోహిత్ శ్రీరాం వెళ్తున్నారు. ఐఎస్‌టిఎస్ ఇంజినీరింగ్ కళాశాల సమీపానికి వచ్చేసరికి రాజమండ్రి వైపునకు బైకుపై వెళ్తున్న వ్యక్తి ఎదురుగా వచ్చి వీరిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు జిఎస్‌ఎల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంకటరమణ మృతి చెందాడు. రోహిత్‌శ్రీరామ్ నడుముకు బలమైన గాయం కావడంతో కాళ్లకు చలనం లేదు. దీనిపై ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేషనల్ డీ వార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పిఠాపురం

జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పట్టంలోని స్థానిక ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ వి.కేశవరావు, పిహెచ్‌సి వైద్యులు వై.వినయ్‌కుమార్ నేషనల్ డి వార్మింగ్ డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో అల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తప్పనిసరిగా విద్యార్థులు ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ సుందరయ్య, రాజేంద్రప్రసాద్, రామారావు, హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కాశీ విశ్వనాథం, పులి ప్రసాదు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నులి పురుగు నియంత్రణ మాత్రలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అపరిశుభ్ర ఆహారం, కలుషిత నీరు సేవించడం వంటి వాటి వల్ల పిల్లల కడుపులో నులిపురుగులు చేరి భరించలేని కడుపునొప్పి, జ్వరం, వాంతులు, విరేచనాలు వంటివి వ్యాపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం హెల్త్ ఆఫీసర్స్ డాక్టర్ టి. రామకిషోర్, డాక్టర్ కె.దినేష్‌కుమార్, ఆదిత్య ప్రొఫెసర్లు వి.సత్యనారాయణ, డాక్టర్ ఎ.వానతి, కన్వీనర్ డాక్టర్ బిహెచ్‌వి.వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.రాంబాబు పాల్గొన్నారు.

నవర కాంప్లెక్స్ ఎత్తివేతపై గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట



నవర హైస్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మండలంలోని నవర కాంప్లెక్స్‌ను ఎత్తివేసే చర్యలపై గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా ఉన్న నవర కాంప్లెక్స్‌ను ఎత్తివేసి ఉండూరు కాంప్లెక్స్‌లో కలిపివేయడాన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. పాఠశాల హెచ్ఎం, ఎఇఒ శివరామకృష్ణయ్య వ్యక్తిగత ప్రయోజనాలను పొందేందుకు ఇలా తమ కాంప్లెక్స్‌ను ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. డిఇఒ, ఎంఇఒ వచ్చి లిఖిత పూర్వకంగా హామీ ఇస్తేనే నిరసనను విరమించేదని స్పష్టం చేశారు. దీంతో డివైఇఒ కె.వెంకటేశ్వరరావు, ఎంఇఒ-1 వై శివరామ కృష్ణయ్య, సిఐ కృష్ణభగవాన్ గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. గ్రామస్తుల డిమాండ్‌ను డిఇఒ దృష్టికి తీసుకెళ్లారు. నవర కాంప్లెక్స్‌ను కొనసాగిస్తామని గ్రామస్తు లకు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం



ఫిజియోథెరఫీ చేస్తున్న వైద్యులు

స్థానిక మహాత్మాగాంధీ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత ఫిజియో థెరపీని వికలాంగ బాలల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఫిజియో థెరపిస్టు డాక్టర్ అపర్ణ అన్నారు. మంగళవారం భవిత కేంద్రంలో వికలాంగ బాలలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక వైకల్యం,సెరెబ్రల్ పాలసీ వైకల్యం ఉన్న పిల్లల తల్లిదండ్రులు ప్రతి వారం భవిత కేంద్రంలో జరిగే ఈ ఉచిత ఫిజియోథెరపీకి తమ పిల్లలను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

నేడు యానాంలో బంద్

ప్రజాశక్తి - యానాం

ప్రజలపై అధిక విద్యుత్ ఛార్జీలు వేయడాన్ని నిరసిస్తూ పుదుచ్చేరి వ్యాప్తంగా బుధవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరుగుతున్న బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఎం యానాం కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులరిటీ అథారిటీ ప్రజాభిప్రాయం పనిలేకుండా ప్రజలపై అదనపు విద్యుత్ ఛార్జీలు వేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వినియోగదారుడు వాడుకున్న విద్యుత్ బిల్లు కంటే అదనపు ఛార్జీతో డబల్ బిల్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ తయారు చేసే కంపెనీలకు నష్టం వచ్చిందని, కొంతమంది పరిశ్రమల యాజమాన్యం వాడుకున్న బిల్లు కట్టకుండా ఎగ్గొట్టిన బిల్లు కూడా ప్రజలపై ప్రతినెల అదనపు ఛార్జీలు వేసి సామాన్య, పేద, ప్రజలపై నడ్డి విరిసే విధంగా ఎలక్ట్రిసిటీ యాజమాన్యం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. 2021 వినియోగ దారుడు బిల్లు కట్టేసినప్పటికీ అప్పటినుంచి సర్ ఛార్జీల పేరుతో అదనపు ఛార్జీలు వేయడం చాలా దారుణమన్నారు. యానాంలో బుధవారం జరగబోయే బంద్‌ను కార్మికులందరూ జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఉత్తమ పద్ధతులతో పశుగణాభివృద్ధి

ప్రజాశక్తి - తాళ్లరేవు


ప్రత్యేక శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

పశువుల పెంపకంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారానే పశుగణాభివృద్ధి సాధ్యమవుతుందని పశుసంవర్ధక శాఖ ఎడి బ్రహ్మవేద అన్నారు. మండలంలోని నీలపల్లి పంచాయతీ నేరెళ్ళంకలో వైద్యురాలు డి. సుధా పర్యవేక్షణలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ చిట్టూరి నాగమణి ప్రారంభించారు. ప్రతి పశువుకు పచ్చగడ్డి, ఎండు గడ్డి కాకుండా వేరుశనగ, నువ్వు పప్పు తెలగపిండి, వంటి పోషకాహారాన్ని ప్రతిరోజు అందించాలన్నారు. ఎదకొచ్చిన పశువులకు ప్రభుత్వం ద్వారా అతి తక్కువ ఖర్చుతో ఇచ్చే ఇంజక్షన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకట రమణ, వస్కా రెడ్డి, వైద్యులు డాక్టర్ సుధీర్, శ్రీనివాస్, శుభశ్రీ, రమణమూర్తి, ప్రియాంక, సుధా గంగమయి, కళ్యాణి పాల్గొన్నారు.

ఆవాస్ యోజన గృహాల ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్ర రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నూతనంగా నిర్మించిన 17 గృహాలను ఎంఎల్ఎ వనమాడి కొండబాబు మంగళవారం ప్రారంభించారు. పర్లోవపేట పూలే కాలనీలో గృహ లబ్ధిదారులు చేత కొబ్బరికాయ కొట్టి గృహ ప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రతి పేదవాడు సొంత ఇంటి కల నెరవేర్చాలని ఆశయంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా పర్లవపేట పూలే కాలనీలో 20 గృహాలు మంజూరు కాగా మంగళవారం 17 గృహాలకు గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, డిఇ సత్యనారాయణ రెడ్డి, ఏఇలు రమణారెడ్డి, విగ్నేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. వివిధ గ్రామాల్లో గోడలపై ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రయోజనాలపై నినాదాలను రాశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ డిపిఎం ఇలియాజర్ మాట్లాడుతూ రైతన్నలు క్రమేపి రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజల ఆరోగ్యం కాపాడడంతోపాటు రైతన్నలు పెట్టుబడి తగ్గడంతో ఆర్థికంగా పరుపుష్టి పొందుతారని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం మరలావ 11 కెవి ఫీడర్‌పై ఆర్‌డిఎస్ఎస్ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల దివిలి సబ్ స్టేషన్ పరిధిలోని చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మరలావ, తూర్పుపాకలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి మహోత్సవం


కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎంఎల్ఎ వనమాడి

ప్రజాశక్తి - కాకినాడ, గండేపల్లి, పెద్దాపురం

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా విశ్వకర్మ పుట్టినరోజును రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏడాది సెప్టెంబర్ 17న నిర్వహిస్తుందన్నారు. ఎంఎల్ఎ వనమాడి మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా నిర్వహించడం గొప్ప శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎం.లల్లి, కాకినాడ, పెద్దాపురం అసిస్టెంట్ బిసి సంక్షేమ అధికారులు ముత్యాల సుబ్బారావు, ఎన్.రాజేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే గండేపల్లిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద విశ్వకర్మ జయంతి పురస్కరించుకుని అన్నదానం క్యార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘము ఆధ్వర్యంలో ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక బస్టాండ్ సమీపంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాళాబత్తుల సాయి, వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, కూటమి నామయకులు పాల్గొన్నారు.


పెద్దాపురంలో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

నవోదయకు 23 వరకూ గడువు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 6 వ తరగతిలో ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 23 వరకు పొడిగించినట్లు నవోదయ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5 తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రవేశ పరీక్ష 2025 జనవరి 18 న జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు నవోదయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నగర సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్‌ను ఆయన కలిసి వివిధ సమస్యలపై 4 వినతిపత్రాలను అందించారు. వినతిపత్రాల ద్వారా మీ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

'వివేకానంద'లో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం

ప్రజాశక్తి-రాజోలు

మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలోని వివేకనందా ఇంగ్లిషు మీడియం స్కూల్లో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ పివివి.వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏటా సెప్టెంబరు 16న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం నిర్వహిస్తారన్నారు. జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది అని తెలిపారు. విద్యార్థులు చిత్రీకరించిన ఓజోన్ చిత్రపటాలు ఆకట్టుకున్నాయి.

గుమ్మిలేరులో సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-ఆలమూరు

గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక హెల్త్ సెంటర్ నందు మంగళవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పోషణ అభియాన ర్యాలీ నిర్వహించి, పౌష్టికాహారం ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మందపల్లి జాస్మిన్, ఎఎన్ఎం నేధులూరి వరలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాన

ప్రజాశక్తి-ఆలమూరు

విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్ అన్నారు. మూలస్థాన అగ్రహారం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో పలు అంశాలపై సదస్సు నిర్వహించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'పిఎం ఆవాస్‌యోజన 2.0' లో సీతమ్మకు గృహం మంజూరు

ప్రజాశక్తి-అమలాపురం

పిఎం ఆవాస్ యోజన 2.0 గ్రామీణ పథకం కింద కాట్రేనికోన మండలం బ్రహ్మ సమాజం గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు సంగాని సీతమ్మ గృహం మంజూరు అయిందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ప్రధాని మోడీ భువనేశ్వర్ నుంచి లైవ్ స్ట్రీమింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ప్రారంభించిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా సంగాని సీతమ్మ గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలో నవోదయ ప్రవేశ పరీక్షకు సిద్ధమయ్యే 70 మంది విద్యార్థులకు మంగళవారం స్టడీ సత్య స్కాన్ అధినేత కాదా వెంకటరమణ వీటిని అంద జేశారు.ప ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల ద్వారా ఎంపిక కాబడిన విద్యార్థులకు స్కాలర్ షిప్ వస్తుందని, నవోదయ స్కూల్లో ప్రవేశం పొందుటకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయి అని తెలియ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి పంపన నాగమణి సుబ్బారావు, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, పాఠశాల హెచ్ఎం పిల్లి శ్రీనివాస్, గ్రామ పెద్దలు పల్లా చినబాబు, వనచర్ల శ్రీనివాసు, తాడి హరికష్ణ, పామర్తి బాబీ, జగతా రమణ పాల్గొన్నారు.

పెరియార్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు అవరణలో ప్రజ్ఞా సాహితీ ఉపాధ్యక్షుడు శరత్ అధ్వర్యంలో మంగళవారం సామాజిక విప్లవకారుడు పెరియార్ ఇవి.రామసామి నాయకర్ 145వ జయంతి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రజ్ఞా సాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పుల్లేపు వెంకటేశ్వర రావు మాట్లాడారు. అనంతరం అంబేద్కర్, పెరియార్ రామసామి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘ నివాళులర్పించారు కార్యక్రమంలో గెల్లా రాజేంద్ర శ్రీను ప్రసాద్ శివ తదితరులు పాల్గొన్నారు.